
సాక్షి తిరుపతి

సోమవారం । 21 । జూలై । 2025



కోదండరాముని పవిత్రోత్సవాలు

తిరుపతిలోని కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో



పంటలపై ఏనుగుల బీభత్సం

చంద్రగిరి మండలంలోని మూలపల్లెలో ఏనుగుల గుంపు పొలాలపై పడి పంటలను తొక్కి నాశనం చేశాయి. - 8లో



షణ్ముఖుని వైభవం..

శ్రీకాళహస్తిలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడి కృత్తికను పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. - 8లో

టార్గెట్ పెద్దిరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి కారును దహనం చేసిన దృశ్యం (ఫైల్)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'పెద్దాయన'గా పేరు ప్రతిష్టలు.. ప్రజా సేవే పరమావధిగా సేవలందించే కుటుంబసభ్యులు.. పేదలతో మమేకమై చేసే రాజకీయాలు.. జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో అనుయాయులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంతం. దశాబ్దాలుగా ఆయన సంపాదించుకుంది జనాభిమానం. ఇదే చంద్రబాబుకు మింగుడుపడని అంశం. అందుకే స్టూడెంట్ పాలిటిక్స్ నుంచి తనకు కొరకరాని కొయ్యగా తయారైన పెద్దిరెడ్డిని లక్ష్యం చేసుకుని కుట్రలకు తెరతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కక్షగట్టి వేధింపులకు దిగుతున్నారు. తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టేందుకు తెగబడుతున్నారు. అందులో భాగంగానే నిరాధార ఆరోపణలతో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారు.

కక్షగట్టి చంద్రబాబు వేధింపులు

- పెద్దిరెడ్డి కుటుంబమే లక్ష్యంగా కుట్రలు
- సొంత నియోజకవర్గంలో సైతం తిరగనివ్వకుండా దాడులు
- ముందుగా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం పేరుతో నాటకాలు
- తర్వాత ప్రభుత్వ, అటవీభూముల ఆక్రమణ అంటూ ఆరోపణలు
- చివరకు తప్పుడు కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసి వికటాట్టహాసం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబమే సీఎం చంద్రబాబు నాయుడుకు అడ్డు. తనకంటే పెద్దిరెడ్డి కుటుంబానికే ఆదరణ పెరుగుతోందని, అందుకే ఆ ఫ్యామిలీ లక్ష్యంగా చంద్రబాబు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదలు నేటి వరకు పెద్దిరెడ్డి కుటుంబంపై చేపట్టిన వేధింపులే నిదర్శనం అనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో అందరూ పెద్దిరెడ్డిని 'పెద్దాయన' అని పిలుస్తుండడం చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో పెద్దిరెడ్డి కుటుంబంపై ఏడాదిగా సాగుతున్న అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలే ఇందుకు సాక్ష్యంగా చూపుతున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధం అయ్యాయి. ఈ ఘటన వెనుక మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హస్తం ఉందంటూ అప్పట్లో హడావుడి చేశారు. ఏదో జరిగిపోయిందని సీఎం చంద్రబాబు హుటాహుటిన హెలికాప్టర్ ఏర్పాటు చేసి డీజీపీ, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీని మదనపల్లెకు పంపించారు. తర్వాత ఆ ఘటనపై కేసులు నమోదు చేశారు. పెద్దిరెడ్డి అనుచరులు కొందరిని అరెస్టు చేశారు. అయితే అవేవీ ఇప్పటి వరకు రుజువు కాకపోవడంతో చివరకు ప్రభుత్వం వెనకడుగు వేసింది.
- రాజంపేట పార్లమెంట్ పరిధిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరులు అనేక మందిని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. ఆస్తులు ధ్వంసం చేశారు. వ్యవసాయ పంటలను నాశనం చేశారు. ఇటుక బట్టీల్లోకి చొరబడి వాటిని విక్రయించి సొమ్ముచేసుకున్నారు. సోమల మండలం కమ్మపల్లెలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులందరినీ నెలల పాటు చిత్రహింసలకు గురిచేశారు. కొంత మంది ఊరొదిలి వెళ్లేలా దౌర్జన్యాలకు తెగబడ్డారు. అనేక మందిపై దాడులు చేసి ఆస్పత్రుల పాలు చేశారు. ప్రధానంగా పుంగనూరులో భయానక వాతావరణం సృష్టించారు. తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేసి రిమాండ్ తరలించి పెద్దిరెడ్డి వర్గాన్ని భయాందోళనకు గురిచేసేందుకు యత్నించారు.
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గత ఏడాది జూలై 18న పుంగనూరు పర్యటనలో భాగంగా చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకుని టీడీపీ గూండాలు మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసంపై రాళ్ల దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను కర్రలు, రాడ్లతో దారుణంగా తరిమికొట్టారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిని ధ్వంసం చేశారు. వాహనాలకు నిప్పు పెట్టారు. మరికొన్ని వాహనాలను ఎందుకూ పనికిరాకుండా నాశనం చేశారు. దాడి చేసింది టీడీపీ గూండాలైతే.. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు మొత్తం 115 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు పలువురికి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో కూటమి నేతలు కంగుతిన్నారు.
- పులిచెర్ల మండలం మంగళంపేట వద్ద పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన మామిడి తోటలలో అటవీశాఖకు చెందిన భూములు ఉన్నాయంటూ పచ్చమీడియాను అడ్డుపెట్టి ప్రభుత్వం నానాయాగీ చేసింది. డ్రోన్ కెమెరాలు, అధికారులను రంగంలోకి దింపి హంగామా సృష్టించింది.
- తిరుపతిలోపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం ఉన్న ప్రాంతం బుగ్గమఠానికి చెందిన భూముల్లోనే అని ఆరోపించి కూటమి ప్రభుత్వం కోర్టులో కేసులు దాఖలు చేసింది. అదే విధంగా కార్పొరేషన్ నిధులతో దారి ఏర్పాటు చేసుకున్నారని, అది కూడా ఆక్రమణేనంటూ ఎల్లో మీడియా ద్వారా విష ప్రచారం చేసింది.



పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలను ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

తప్పుడు కేసులో..




ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి


- తాజాగా లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేసి కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించింది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా చేసిన ఈ అక్రమ అరెస్టును వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు సామాన్యులు సైతం తీవ్రంగా ఖండిస్తున్నారు.

జలయజ్ఞంపై బాబు విషం

కృష్ణమ్మ జలాలను పుంగనూరుకు తీసుకొచ్చి నిల్వ చేయడానికి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సంకల్పించారు. నాటి పాదయాత్రలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను వివరించారు. అధికారంలోకి రాగానే ప్రాజెక్టులతో పడమటి ప్రాంతాలకు నీరు ఇచ్చే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లోని ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లెలో రూ.1200 కోట్ల వ్యయంతో ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ మూడు ప్రాజెక్టులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గుర్తింపు లభిస్తుందని, ఎన్నికల సమయంలో దీనిని అడ్డుకోవాలని చంద్రబాబునాయుడు ప్రాజెక్టులపై విషం చిమ్మారు. చోటా నేతలచే గ్రీన్ ట్రిబ్యునల్‌లో తప్పుడు కేసులు వేసి పనులు అడ్డుకున్నారు. దీని కారణంగా పడమటి నియోజకవర్గాలకు జీవజలం లేక విలవిల్లాడే పరిస్థితి నెలకొంది.



టీడీపీ నేతలు అడ్డుకున్న నేతిగుట్లపల్లె రిజర్వాయర్





కేసులు వేసి టీడీపీ నేతలు అడ్డుపడడంతో అసంపూర్తిగా ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్



పుత్తూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి

కుట్రలకు పెద్దిరెడ్డి కుటుంబం వెరవదు



పెద్దిరెడ్డి కుటుంబ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిదశగా ఓ బూటకపు మద్యం కుంబకోణాన్ని వెలుగులోకి తెచ్చింది. అందులోకి ఎలాంటి సంబంధం లేని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి విచారణ పేరుతో సిట్ కార్యాలయానికి పిలిపించి అరెస్టు చేసింది. ప్రజాభిమానం కలిగిన మిథున్‌రెడ్డి విలువలతో కూడిన రాజకీయం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలిచారు. అలాంటి నాయకుడిపై మద్యం కేసు నమోదు చేయడం దుర్మార్గం.

– నూకతోటి రాజేష్, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త

న్యూస్‌రీల్

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గం



మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నేతల నిరసన

గూడూరురూరల్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని గూడూరు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టుకూరు మహేంద్రరెడ్డి తీవ్రంగా ఖండించారు. గూడూరు మండల నెలటూరులోని ఆదివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కక్ష పూరితమైన రాజకీయాలు చేస్తూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం సబబు కాదన్నారు. ఇకనైనా అక్రమ కేసులకు స్వస్తి పలికి ప్రజల బాగోగులు చూసేలా అడుగులు వేయాలని హితువు పలికారు. అనంతరం అక్రమ అరెస్టుకు నిరసనగా కరపత్రాలను ప్రదర్శించారు. సమావేశంలో మెడనూలు రవీంద్రరెడ్డి, పాలెపు గోపాలయ్య, పెరికల శీనయ్య, నన్నూరు రాజశేఖర్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నారు. వివిధ సమస్యలపై అర్జీదారులు అధికారులకు తమ సమస్యలను వెల్లడించడానికి వీలుంటుంది. కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు అందుబాటులో ఉండనున్నారు.

తెలుగు గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: తిరుపతి జూపార్క్ రోడ్డులోని ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు(టీజీటీ) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.రేష్మ తెలిపారు. ఈ నెల 23వ తేదీలోపు జూపార్క్ రోడ్డు టాటా క్యాన్సర్ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏంఏ (తెలుగు), బీఈడీ కలిగి ఉండాలని, మరిన్ని వివరాలకు 9000783185ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 90,011 మంది స్వామివారిని దర్శించుకోగా 33,328 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

బాబు అరాచకాలు ప్రజలు చూస్తున్నారు



కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేస్తున్న అరాచకాలను ప్రజలు చూస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. ఇది కుట్రపూరితంగా పెట్టిన అక్రమ కేసు. ఎన్ని కుట్రలు చేసినా, కేసులు పెట్టినా న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. – భరత్, ఎమ్మెల్సీ, కుప్పం

మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు అప్రజాస్వామికం. కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ అరాచకాలకు పాల్పడుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని చూసి చంద్రబాబుకు వణుకుపుడుతోంది. అందులో భాగంగానే అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఎంపీని అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను రాష్ట్ర ప్రజలే తిప్పి కొడతారు.

– కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్

కక్షగట్టి.. అరెస్ట్ చేసి



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటున్నారనే నెపంతో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. కూటమి పాలనలో కక్షసాధింపులు తారస్థాయికి చేరాయి. ఉద్యోగులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. కక్ష సాధింపులో భాగంగానే అరెస్టుల పరంపర జరుగుతోంది. 2014–19 పాలనాకాలానికి సంబంధించి చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై 13 అవినీతి కేసులు ఉన్నాయి. ఇందులో మద్యం కుంభకోణం కేసు కూడా కీలకమైంది. ఈ కేసులను నిర్వీర్యం చేసేందుకు సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఇలా చేస్తున్నారు. –విజయానందరెడ్డి, సమన్వయకర్త చిత్తూరు నియోజకవర్గం

లోకేష్ నీకు చిప్పకూడే గతి



కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం బాధాకరం. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు పరిపాలన మీద దృష్టి పెట్టకుండా తమ స్వార్థం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. యువగళం పాద యాత్రలో ప్రజలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చిన నారా లోకేష్ పక్షాన ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వానికి మూల్యం చెల్లించే సమయం ఆసన్నమైంది.

– వీ.హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి

కక్ష సాధింపులకు పరాకాష్ట



లిక్కర్ స్కామ్ పేరుతో తప్పుడు కేసు పెట్టి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపులకు పరాకాష్ట. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇబ్బంది పెట్టేందుకే చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇలాంటి కుట్రపూరిత చర్యలతో వైఎస్సార్‌సీపీని దెబ్బతీయలేరు. ప్రజా సమస్యలపై నిరంతరం పార్టీ పోరాడుతుంది. ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు.

– బీరేంద్రవర్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

ఐఐటీ పట్టభద్రుల పట్టాభిషేకం

- అట్టహాసంగా తిరుపతి ఐఐటీ 7వ స్నాతకోత్సవం
- కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆనందోత్సవాలు





గవర్నర్ అవార్డును అందుకుంటున్న మేఘవర్షిణి, ప్రెసిడెంట్ అవార్డుతో అరవింద్ శ్రీనివాసన్



పట్టా అందుకున్న ఆనందంలో ఐఐటీ విద్యార్థులు

ఏర్పేడు : వారంతా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అత్యున్నత ప్రతిభావంతులు... ప్రఖ్యాత జాతీయ విద్యాసంస్థ ‌ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) తిరుపతి ప్రాంగణంలో సీటు సంపాదించి దిగ్విజయంగా కోర్సును పూర్తి చేశారు. ఏళ్ల తరబడి తాము పుస్తకాలతో కట్టిన దోస్తీ.. మెదడులో కదలాడిన విభిన్న ఆలోచనలతో ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు.. తాము ఎంచుకున్న కోర్సులో అత్యుత్తమ ప్రతిభను కనబరచి గొప్ప మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. కష్టానికి తగిన ప్రతిఫలం అందుకునేందుకు తెల్లకోటు ధరించి..తిరుపతి ఐఐటీ లోగోతో కూడిన వస్త్రాన్ని కప్పుకుని తల్లిదండ్రులు, ఆప్తులు, అనుయాయుల కరతాళ ధ్వనుల మధ్య ఆచార్యుల చేతుల మీదుగా అందుకున్న 'పట్టా' వారందరిని ఆనందంలో ముంచెత్తింది. పట్టాను అందుకుని భవిష్యత్తులో తాను చేరాల్సిన గమ్యాన్ని మదిలో తలచుకుని సంతోషంలో మునిగి తేలారు. ఆదివారం సాయంత్రం జరిగిన తిరుపతి ఐఐటీ 7వ స్నాతకోత్సవ వేడుక వారందరి జీవితాల్లో ఓ మరపురాని ఘట్టంగా నిలిచింది.

ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ అధ్యక్షతన 7వ స్నాతకోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రియా యూనివర్శిటీ చాన్సలర్, కాగ్నిజెంట్ కో ఫౌండర్ లక్ష్మీనారాయణన్, జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్ గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఏర్పేడు సమీపంలోని శాశ్వత ప్రాంగణంలో నడుపుతున్న ఐఐటీలోని వసతులు, కోర్సులలో ఉన్న విద్యార్థులు, సాధించిన విజయాలు, అధిగమించిన సవాళ్లను గురించి వివరించారు. స్నాతకోత్సవ వేడుకలో విద్యార్థులతో కలసి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కోర్సు పూర్తి చేసుకుని బయటకు వెళ్లనున్న విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగానికి ఉన్న ప్రాధాన్యం గుర్తించి అవకాశాలను అందిపుచ్చుకుని గొప్ప ఆవిష్కర్తలుగా మారి దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలన్నారు. ముఖ్య అతిథి లక్ష్మీనారాయణన్ మాట్లాడుతూ.. గొప్ప ఇంజినీర్లుగా రాణించి నూతన ఆవిష్కరణలతో దేశాన్ని ముందు వరుసలో నిలపాలన్నారు. జీవితంలో ప్రతి దశలోనూ సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన ఎంతో అవసరమన్నారు. ప్రణాళికతో కూడిన కఠోర శ్రమతోనే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారన్నారు.

418 మందికి పట్టాలతో సత్కారం

స్నాతకోత్సవంలో ఐఐటీలో చదివిన మొత్తం 418 మంది విద్యార్థులకు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా పట్టాలను అందించి ఘనంగా సత్కరించారు. అందులో మొత్తం 212 మంది విద్యార్థులకు బీటెక్ డిగ్రీ పట్టాలు, 91 మందికి ఎంటెక్ డిగ్రీ పట్టాలు, 53 మందికి ఎంఎస్సీ డిగ్రీ పట్టాలు, 16 మందికి ఎంపీపీ డిగ్రీ పట్టాలు, 13 మందికి ఎంఎస్ (రీసెర్చ్) డిగ్రీ పట్టాలు, 28 మందికి పీహెచ్‌డీ డిగ్రీ పట్టాలు, ఒకరికి ఎంటెక్, పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ పట్టా, ఒకరికి డిప్లొమా పట్టా, మరొకరికి సర్టిఫికెట్ ఆఫ్ ఫౌండేషన్ పట్టాలను ప్రదానం చేశారు. విద్యార్థులు పట్టాలు అందుకుంటుండగా సభికులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు.

ప్రెసిడెంట్, గవర్నర్ పతకాలు ప్రదానం

తిరుపతి ఐఐటీలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు సర్వతోముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు. బీటెక్ (సీఎస్ఈ) విద్యార్థి అరవింద్ శ్రీనివాసన్‌కు బెస్ట్ అకడమిక్ పెర్ఫామెన్స్ ఇన్ ద బీటెక్ ప్రోగ్రాం కింద స్నాతకోత్సవ సభలో ప్రెసిడెంట్ మెడల్, బంగారు పతకం అందించి సత్కరించారు. అలాగే ఆల్‌రౌండ్ ప్రొఫెసియెన్సీ ఇన్‌రికులర్, ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్ ఇన్ బీటెక్ ప్రోగ్రాంలో ప్రతిభను కనబరిచిన బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్) విద్యార్థిని మేఘవర్షిణి గవర్నర్ పతకంతో సత్కరించారు. మేఘవర్షిణి కమతం కృష్ణయ్య అవార్డును కూడా అందుకున్నారు. అలాగే ఆర్వీ అసోసియేట్ ప్రైజ్‌ను కొత్తపల్లి ఈశ్వర్ వెంకటసాయి వర్మ, ఫస్ట్ డీన్ ప్రైజ్‌ను షేక్ మహ్మద్ అల్లా బక్షి ఇన్‌స్టిట్యూట్ ప్రైజును పింకేష్‌కుమార్ మిశ్రా, అరవింద్ శ్రీనివాసన్, టి.ఆదిత్యన్, గౌరవ్ త్రిపాఠి, బి.గాయత్రి, కె.మదన్‌మోహన్, జయదీప్‌రాయ్, రితిక్ మండల్, అమరరాజ ప్రైజ్‌ను సుధాకర్ వెంకటాచలం, ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్‌ను శృతి షజి, రామకృష్ణన్ అండ్ లక్ష్మీకాంతన్ మెమోరియల్ ప్రైజ్‌ను చిరంజీవి, శ్రీనివాసన్ నటరాజన్ అవార్డును ఆకాష్ ఉనియల్, ఆకురతి కుమారస్వామి ప్రదానం చేశారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని తుమ్మూరు సమీపంలోని రామాలయం వెనుక వైపు ఉన్న చెట్టుకు ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలం వద్దకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడు చొక్కా లేకుండా బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించినా ఎటువంటి ఆధారాలు దొరకలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లుగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక మార్చురీలో భద్ర పరిచి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

హాస్టల్‌లో విద్యార్థుల ఘర్షణ

– అందుబాటులో లేని వార్డెన్

కలువాయి (సైదాపురం) : మండల కేంద్రమైన కలువాయిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శుక్రవారం రాత్రి కరెంట్ పోవడం పదో తరగతి విద్యార్థులు 6,7 తరగతులు విద్యార్థులు గొడవపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే హాస్టల్లో ఉండాల్సిన వార్డెన్ , వాచ్‌మెన్ అందుబాటులో లేకపోవడంతో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు విషయం తెలియజేయగా తల్లిదండ్రులు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వద్దకు వచ్చి జరిగిన సంఘటనను తెలియజేశారు. పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోతామని హాస్టల్‌లో ఉంచమని తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడికి తెలిపారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చుస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సమ్మతించారు.

కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత

నాయుడుపేటటౌన్: రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ అశోక్(22) మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్యులు పోలీసుల సమక్షంలో ఆదివారం పోస్టుమార్టం జరిపారు. అనంతరం అశోక్ మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ అశోక్ తీవ్రంగా గాయపడడంతో ప్రథమ చికిత్స చేసినట్లు ప్రభుత్వ వైద్యులు వెంకటరత్నం తెలిపారు. శనివారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి మృతి చెందినట్లుగా తెలిపారు. దీనికి వైద్యులు నిర్లక్ష్యం వహించారంటూ వస్తున్న ఆరోపణలను ప్రభుత్వ వైద్యులు ఖండించారు.

అత్యవసర సేవలకు సుస్తీ!

- సత్యవేడు ఆస్పత్రిలో మొక్కుబడిగా వైద్యసేవలు
- రాత్రివేళల్లో అంతా రెఫర్‌లకే పరిమితం
- మెరుగైన వైద్యానికి తమిళనాడు, తిరుపతికి రెఫర్లు
- ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు



సత్యవేడులోని సీహెచ్‌సీ హాస్పిటల్

వరదయ్యపాళెం : సత్యవేడు కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్యసేవలు మొక్కుబడిగా మారాయి. ప్రధానంగా రాత్రివేళల్లో వైద్యం కోసం వచ్చే వారికి వైద్యం అందని ద్రాక్షగా మారింది. అక్కడ ఉన్న వైద్యులు మొక్కుబడి సేవలకే పరిమితం అవుతున్నారు. పేరుకు 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా కొనసాగుతుందే తప్ప పూర్తి స్థాయి వైద్య సేవలు అందడం లేదు. అత్యవసర వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనంత దూరంలో నిలిచాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో ఏళ్ల తరబడి వైద్య సేవలకు భరోసా లభించడం లేదు.

సత్యవేడుకు సమీపంలో శ్రీసిటీ పారిశ్రామిక వాడ ఉండడం. ఇటు తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో వందల మంది సత్యవేడు మీదుగా శ్రీసిటీ పరిశ్రమలకు ద్విచక్ర వాహనాలు, కార్లలో విధులకు వెళ్తుంటారు. అయితే ఈ మార్గంలో తరచూ రాత్రివేళ ప్రమాదాలు జరుగుతుంటాయి. వరదయ్యపాళెం, చిన్న పాండూరు, సత్యవేడు పరిసర ప్రాంతాలతో పాటు నాగలాపురం వరకు కమ్యూనిటీ వైద్యశాల సేవలు ఒక్క సత్యవేడులోనే ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో ఎక్కడ ప్రమాదాలు జరిగినా ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడినా వైద్యం కోసం గుర్తుకొచ్చేది సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలే. ఇక్కడ మాత్రం అందుకు తగిన విధంగా మెరుగైన వైద్యసేవలు అందడం లేదని ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఓపీ తీసుకున్న వెంటనే అక్కడ వైద్యులు బాధిత రోగికి మెరుగైన వైద్యం చేయాలని మీరు తిరుపతి, తమిళనాడులోని తిరువళ్లూరు, చెన్నై ప్రాంతాలకు తీసుకువెళ్లాలని ఉచిత సలహాలను ఇస్తున్నారు. దీంతో రాత్రివేళ వారికి అటు అంబులెన్స్ సౌకర్యం దొరక్క ప్రైవేటు వాహనాలతో వ్యయ ప్రయాసలతో ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి దాపురించింది.

అమలు కాని 100 పడకల ఎన్నికల హామీ

ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో సత్యవేడు టవర్ క్లాక్ సాక్షిగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలో సత్యవేడు కమ్యూనిటీ హాస్పిటల్‌ను 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి 13 నెలలు పూర్తవుతున్నా నేటికీ ఆ హామీ ఆచరణకు నోచుకోలేదు.

పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నా..

సత్యవేడు సీహెచ్‌సీకి పూర్తి స్థాయిలో 12 మంది వైద్యులు ఉండాలి. రెండు నెలల క్రితం ఆరుగురి వైద్యులకే పరిమితం అయితే.. నేడు పూర్తి స్థాయిలో వైద్యులను భర్తీ చేయడం జరిగింది. అయితే వైద్యసేవలు మాత్రం నామమాత్రంగానే మారాయి. కనీసం చిన్న పాయిజన్ కేసులకు వైద్యం చేయలేని దుస్థితిలో సేవలు కొనసాగుతుండడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రత్యేక చొరవతో ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన వైద్యులు పేదలకు మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

గర్భిణుల పరిస్థితి దయనీయం

సత్యవేడు కమ్యూనిటీ హాస్పిటల్‌లో గర్భిణుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రధానంగా గర్భం దాల్చిన మహిళలు నెలసరి వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వస్తుంటారు. అయితే ఇక్కడ గైనకాలజిస్ట్ గత నెల వరకు అందుబాటులో లేరు. దీంతో అటు శ్రీకాళహస్తి, తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి, అయితే తాజాగా గైనకాలజిస్ట్ విధుల్లో చేరారు. అయితే ఏ మేరకు గర్భిణులకు వైద్యసేవలు అందుతాయో వేచి చూడాల్సిన పరిస్థితి.

రాత్రివేళ సేవలు పటిష్టం చేయాలి

ప్రధానంగా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సత్యవేడులో రాత్రివేళ అత్యవసర వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి. వైద్యం కోసం ఆస్పత్రిని ఆశ్రయించే ప్రతి పేషెంటుకు ఆస్పత్రిలో ఉన్న వసతుల మేరకు వైద్యసేవలు అందించేందుకు విధుల్లో ఉన్న వైద్యులు చొరవ చూపాలి. ఎందుకంటే సత్యవేడు నుంచి అటు తిరుపతికి వెళ్లాలన్న, ఇటు చెన్నైకు వెళ్లాలన్న కనీసం 2 గంటల సమయం పడుతుంది. ఈ పరిస్థితుల్లో వీలైనంత వరకు ప్రాథమికంగా మెరుగైన వైద్యం అందించగలిగితే అత్యవసర పరిస్థితుల నుంచి సాధారణ పరిస్థితికి వచ్చే అవకాశం ఉంటుంది. తదుపరి మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది.

రెండు ఆలయాల్లో చోరీ

సత్యవేడు: మండలంలోని మదనంబేడు పంచాయతీ పరిధిలోని శివాలయం, నాగాలమ్మ గుడి ఆలయాల్లో శనివారం రాత్రి దుండగులు హుండీలు పగుల గొట్టి భక్తులు స్వామి, అమ్మవార్లకు సమర్పించిన నగదు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం గుడిలో పూజ చేసేందుకు వెళ్లిన పూజారి ఆలయ హుండీ పగుల గొట్టి ఉండడం గుర్తించి సర్పంచ్ శివరంజనీ, వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు వెంకటేశన్‌కు తెలిపారు. చోరీపై పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

నాయుడుపేట టౌన్ : మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. ముందుగా పట్టణంలోని ఎల్‌ఏ సాగరం బీడీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, కూటమి పార్టీల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని పవిత్రోత్సవాలు



యాగశాలలో హోమం, ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



స్వామి వారికి 4 ముత్యాల కిరీటాలు విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్ : కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి పవిత్రోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు సీతా రామ సమేత లక్ష్మణ స్వామి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు తీసుకొచ్చి స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం శాత్తుమొర, ఆసాథనం నిర్వహించారు. కాగా సాయంత్రం 5.30 గంటలకు సీతారామ లక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పవిత్ర ప్రతిష్ట, శయనాధివాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

స్వామి వారికి 4 ముత్యాల కిరీటాలు వితరణ

కోదండరామస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి ఉత్తవ మూర్తులకు తిరుపతికి చెందిన పురుషోత్తం 4 ముత్యాల కిరీటాలు విరాళంగా అందజేశారు.

విధులకు వెళుతూ.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి దుర్మరణం
- ఆర్టీసీ బస్సు అతివేగమే ప్రమాదానికి కారణం



ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో టైరు కిందకు వెళ్లి చిక్కుకున్న ద్విచక్రవాహనం (ఇన్‌సెట్) మృతిచెందిన రాజశేఖర్



రోడ్డుపై భర్త మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న రాజశేఖర్ భార్య

తిరుపతి రూరల్ : తిరుపతి రైల్వే స్టేషన్ ఆవరణలోని ఐఆర్‌సీటీసీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి విధులకు వెళుతుండగా మార్గ మధ్యలోనే విగతజీవుడైన సంఘటన తిరుపతి రూరల్ మండలంలో చోటు చేసుకుంది. తిరుపతి – చంద్రగిరి మార్గంలోని సి.మల్లవరం క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... చంద్రగిరి మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ బాబు (44) ఐఆర్‌సీటీసీలో టూరిస్టు గైడ్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగానే అతను తన సొంతూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన రాజశేఖర్‌బాబు తన ఇద్దరు కూతుళ్లను చంద్రగిరిలోని ఓ డ్యాన్స్ కోచింగ్ సెంటర్‌లో వదిలిపెట్టి జాతీయ రహదారి మీదుగా తిరుపతికి బయలుదేరాడు. జాతీయ రహదారి నుంచి సి.మల్లవరం గ్రామం మీదుగా చంద్రగిరి – తిరుపతి మార్గంలోకి చేరుకుని తిరుపతి వైపు వాహనాన్ని మళ్లించాడు. ఇంతలో తిరుపతి నుంచి పుంగనూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న ఆటోను అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణించే రాజశేఖర్‌బాబు తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రాజశేఖర్ బాబుకు భార్య ఉషారాణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్టీసీ బస్సు అతివేగంగా రావడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికంగా నివాసం ఉంటున్న వారు చెబుతున్నారు. మృతుడు నరసింగాపురానికి చెందిన వ్యక్తి కావడంతో సమీపంలోని గ్రామ ప్రజలు అతనిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ షేక్‌షావల్లీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెళ్లొస్తానని చెప్పి.. తిరిగిరాని లోకాలకు..

విధి నిర్వహణకు బయలుదేరిన రాజశేఖర్‌బాబు ఇంటి వద్దనున్న భార్య, డ్యాన్స్ క్లాస్‌లో విడిచిన పిల్లలతో వెళ్లొస్తానని చెప్పిన అర గంటకే మృత్యువాత పడడంతో కుటుంబీకులు ప్రమాద స్థలికి చేరుకుని బోరున విలపించారు. వెళ్లొస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయావా.. అంటూ మృతుడి భార్య ఉషారాణి విలపించడం చూసిన వారిలో కంటతడి పెట్టించింది.

ప్రయాణికులను బురిడీ కొట్టించే మోసగాడు అరెస్టు

- రూ.87 వేలు స్వాధీనం



అదుపులోకి తీసుకున్న నిందితుడితో రైల్వే పోలీసులు

తిరుపతి, అన్నమయ్య సర్కిల్ : ప్రయాణికుల సెల్‌ఫోన్ల నుంచి డబ్బులు దొంగలించే మాయగాడిని ఆదివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన నిందితుడు వేణుబాబు సాధారణ ప్రయాణికుడిలా రైల్వే టికెట్ తీసుకుని తన తోటి ప్రయాణికులతో మాయ మాటలు మాట్లాడుతూ.. నమ్మకం కలిగిస్తాడు. తను బంధువులు, మిత్రులతో మాట్లాడడానికి అని చెబుతూ వారి మొబైల్‌ను తీసుకొని వారికి తెలియకుండా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతరత్రా డబ్బును పంపడానికి, స్వీకరించడానికి ఉపయోగించే యాప్ లను వినియోగించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును తస్కరించి తన బ్యాంకు ఖాతాలకు పంపించుకుంటాడు. ఈ విధంగా ప్రయాణికులను బురిడీ కొట్టిస్తున్న దొంగను రైల్వే పోలీస్ (జీఆర్పీ), రైల్వే భద్రత దళం (ఆర్పీఎఫ్) పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు ఒంగోలుకు చెందిన వేణుబాబుగా గుర్తించారు. గత సంవత్సరం 2024 అక్టోబర్ నెలలో తిరుపతి రైల్వే స్టేషన్‌లోని ఒక ప్రయాణికుడిని నమ్మించి అతడి మొబైల్‌ను తీసుకొని రూ.87 వేలు తనకు నచ్చిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసుకున్నాడనే విషయాన్ని విచారణలో తెలుసుకున్నారు. అనంతరం ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆశీర్వాదం పేర్కొన్నారు. చాకచక్యంగా దొంగను పట్టుకున్న ఎస్‌ఐలు ధర్మేంద్ర, రామకృష్ణ బృంద సభ్యులను రైల్వేస్టేషన్ అధికారులు అభినందించారు.

పంటలపై ఏనుగుల బీభత్సం

- అటవీ సరిహద్దు గ్రామాల్లో భయం..భయం
- బిక్కుబిక్కుమంటూ గడిపిన పల్లె ప్రజలు



ఏనుగులు ధ్వంసం చేసిన పంట

చంద్రగిరి : ఏనుగుల గుంపు సమీప గ్రామాలపై పడటంతో పల్లె ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని మూలపల్లి అటవీ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి సుమారు 9 ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి నాశనం చేశాయి. వరి పంటను తొక్కి నాశనం చేయగా ఓ రైతుకు చెందిన మామిడి తోటలోని ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాయి. పంట పొలాల సమీపంలో నివాసం ఉంటున్న రైతుల ఇళ్ల వద్దకు ఏనుగులు చేరుకోవడం తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పెద్ద ఎత్తున ఏనుగులు ఇళ్ల వద్దకు చేరుకున్నాయని, తమకు రక్షణ కల్పించాలంటూ అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాత్రంతా బిక్కుబిక్కు మంటూ గడిపాం



ఆదివారం రాత్రి సుమారు 9 ఏనుగుల గుంపు మా పంట పొలాలపై దాడులు చేశాయి. పంటలను తొక్కి నాశనం చేయడంతో పాటు ఫెన్సింగ్ తొక్కేశాయి. ఇంటి సమీపంలోకి ఏనుగులు రావడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాం. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపాం. – నాగరాజమ్మ, దేవకమ్మ, మూలపల్లి

అటవీ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదు




ఇంటి వద్దకు ఏనుగులు వచ్చి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, మాకు రక్షణ కల్పించాలని అటవీ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా స్పందించలేదు. మీరు ఇంట్లోకి వెళ్లి పడుకోండంటూ ఉచిత సలహా ఇచ్చారు. ఇంటిపై ఏనుగులు దాడి చేసి ఉంటే మా ప్రాణాలు పోయేవి. – యశోదమ్మ, మూలపల్లి

బదిలీ ఉత్తర్వులు బేఖాతరు

కలువాయి (సైదాపురం) : మండలంలోని తోపుగుంట సచివాలయ వీఆర్‌ఓగా వంశీప్రదీప్ బదిలీ ఉత్తర్వులతో ఇటీవల కలువాయి తహసీల్దార్‌ను కలిసి విధుల్లోకి అనుమతించాలంటూ జాయినింగ్ రిపోర్టు ఇచ్చాడు. అయితే ఇందుకు జిల్లా అధికారుల బదిలీ ఉత్తర్వులను తహసీల్దార్ బేఖాతార్ చేశారు. దీంతో పది రోజులు కావస్తున్నా తన పరిస్థితి ఏమిటో అర్థం కాక వీఆర్‌ఓ జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి తన బాధను చెప్పుకున్నాడు. దీంతో డీఆర్‌ఓ కలువాయి తహసీల్దార్‌తో ఫోన్‌లో సంప్రదించి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పినట్లు వీఆర్వో వంశీప్రదీప్ తెలిపారు. డీఆర్వో ఇచ్చిన గడువు కూడా ముగిసిందని వీఆర్వో వాపోయాడు. కూటమి నేతలు ఓకే చెబితేనే ఆయా గ్రామ సచివాలయాల్లో బదిలీకి అనుమతిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడిన భారీ బండ

కేవీబీపురం: మండలంలోని వీజే క్వారీ నుండి తరలిస్తున్న సుమారు పది టన్నుల బరువున్న భారీ బండ ప్రమాదవశాత్తు వాహనంలో నుండి రోడ్డుపై పడింది. పెరిందేశం రెవెన్యూ పరిధిలోని వీజే క్వారీ నుండి ఆదివారం తెల్లవారుజామున 30 టన్నులు బరువున్న మూడు భారీ బండలను పెద్ద కంటైనర్‌లో తరలించారు. ఆ వాహనం కేవీబీపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్పీడ్‌బ్రేకర్ వద్దకు చేరుకోగానే వాహనంలోని ఒక భారీ బండ కింద పడింది. దీంతో ఆ వాహనం వెనుక వస్తున్న వాహనాలు త్రుటిలో ప్రమాదం నుండి తప్పించుకున్నాయి. రోడ్డుపై పడిన బండను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.

ఎస్‌బీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి క్రైమ్: తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా వెంకటనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న గిరిధర్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు. వీఆర్‌లో ఉన్న వెంకటనారాయణ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. గతంలో స్థానికంగా ట్రాఫిక్, తిరుపతి డీఎస్పీగా పనిచేసిన అనుభవం తనకు చాలా ఉందని, ఈ అనుభవంతో శాంతి భద్రతలను కాపాడుతానని ఆయన చెప్పారు.



ఇంద్ర విమానంపై ఊరేగుతున్న కుమారస్వామి



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

షణ్ముఖుని వైభవం..ఆడికృత్తిక సంబరం



నెమలి వాహనంపై కుమారస్వామి

విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆదివారం ఆడి కృత్తికను పురస్కరించుకుని స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. భక్తులు కావళ్లు మోస్తూ, తలనీలాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సుబ్రహ్మణ్య స్వామి ఇంద్ర విమానంపై పుర విహారం చేశారు. రాత్రి నెమలి వాహనంపై భక్తులను కటాక్షించారు.

– శ్రీకాళహస్తి



కావడి మోస్తున్న చిన్నారి